

# ఈతరం కథ

## 'ఉమ'

అది పొలిమేర! మరికొంత దూరంలో ఆకాశపుటంచులు భూదేవిని కలుసుకుంటున్నట్లు ఏదో భ్రమకలుగుతున్నది. అక్కడ కొన్ని సంవత్సరాలుగా పెరుగు

తున్న సరివిచెట్ల మధ్య శిధిలమైన దేవాలయం వుంది. అందులో కూలిపోయిన గర్భగృహం నడుమ శిరస్సులేని దేవుని మొండి విగ్రహ మొకటి ఏ పూజకూ నోచుకోక దాగునివుంది. అనన్యత్వము లేని ఆ దేవుడు మానవుని మనోభావాలకు అనుగుణంగా ప్రకృతి ఆడుతున్న వింత నాటకాన్ని సందర్శిస్తూ వుంటాడు. ఆ దేవుని దర్శనానికి అప్పుడప్పుడు కొందరు భక్తులు వస్తూవుంటారు. ఆ సాయంత్రం అక్కడికి చంద్రం వచ్చాడు.

చంద్రం....

బి.ఎ. గ్రాడ్యుయేటు. ఉద్యోగం కొరకు రెండు సంవత్సరాలు ఎన్నోఆదర్శాలతో కాళ్ల అరిగిపోయేలా తిరిగి చివరకు 'కట్న'మనే లంచానికి అమ్ముడుపోయి మామగారి సహాయంతో పై ఆఫీసరుకు లంచంకుమ్మరించి చిన్నఉద్యోగం సంపాదించాడు. పెద్దలు గీసిన గీటు దాటకుండా, సంఘం చేసిన నియమాలు అతిక్రమించకుండా సక్రమంగా బ్రతుకుతున్న సగటు మనిషి చంద్రం.

ప్రొద్దు పొడిచినప్పటినుండీ అసంతృప్తితో ప్రాకులాడినపగలు అలసటతో గమ్యస్థానం చేరుకుంటూ వుంది. జరుగుతున్న అన్యాయాలకూ, అక్రమాలకూ కోపగించుకున్నదేమో నన్నట్లు పడమట ఆకాశం ఎఱ్ఱగా కందిపోతున్నది.ప్రకృతి చేసిన నిబంధనల ననుసరించి విధిగా తన కర్తవ్యం నెరవేర్చుకొని వడివడిగావెళ్ళిపోతున్నాడు వెలుగురేడు. స్వేచ్ఛాజీవుల్లా హద్దులు దాటుకుని గగనానికి ఎగబ్రాకిన పచ్చని సరివిచెట్లు గాలికి ఊగుతూ జరుగుతున్న దారుణాలకు మూలుగుతున్నవా అన్నట్లు రొదపెడుతున్నవి!

బండరాతిమీద కూర్చుని ప్రకృతిని పరికించి చూచాడు చంద్రం. ఆప్రదేశం తనలాంటి వారికొరకు దేవుడు భద్రపరచినట్లు ఉందనుకుంటూ ఆలోచనలో పడిపోయాడు. సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం ఒకసారి....అర్ధరాత్రి దొంగలా దోబూచులాడుకుంటూ అడ్డదార్లగుండా వచ్చి శిధిలమైనగుడిలో అడుగుపెట్టాడు. రామాన్ని కలుసుకోవాలనే ఆతురతతో ప్రాణాలు తెగించి వచ్చాడు. అప్పటికే రామాన్ని పట్టియిచ్చిన వారికి 25 వేల రూపాయల బహుమానం కూడా ప్రకటించివుంది ప్రభుత్వం.

రామం!!

కాలేజీలో చంద్రానికి ఆప్తమిత్రుడు. తోటి విద్యార్థులకు నాయకుడు. "మన దేశంలో ఎన్నో మార్పులు రావాలి. నేటి యువతరం సాధించలేనిదంటూ ఏదీలేదు" అంటూ ఆవేశంతో రామం ఇచ్చే ఉపన్యాసాలు వింటూ వుంటే చంద్రం రక్తం ఉడుకెత్తి ప్రవహించేది. గుండె దడదడా కొట్టుకొనేది. రామం స్టేజి ఎక్కి "భారత్‌మాతాకు జై" అని ఎలుగెత్తి అరచినప్పుడు విద్యార్థిమూక

అతనితోపాటు కలిసి జైజై వినాదాలు కలిపేవారు. చంద్రం గర్వంతో పొంగి పోయేవాడు. అతని కనుకొనల్లో ఆనంద బాష్పాలు నిండుకునేవి.

అటువంటి రామం.... రెండు సంవత్స రాలక్రితం శిధిలమైన దేవాలయంలో మొండి రాతివిగ్రహం వెనుక ముద్దాయి వలె దాగుని తన రాకకై పొంచిపొంచి చూస్తూవుంటే చంద్రానికి దుఃఖం పొంగి పొరలింది. అతని కన్నీటిధారతో ఎన్నో నాళ్ళ పూజ పునస్కారంలేక దుమ్ము కొట్టుకొని వున్న ఆ రాతి దేవునిమొండా నికి అభిషేకం జరిగినట్లైంది!

"పిచ్చివాడా! నా కోసం ఏడుస్తు న్నావా? ఈ భూమాతకు నా ప్రాణం బలివ్వటానికి సిద్ధంగా ఉన్నానురా!" అని రామం అంటూవుంటే రామం కను లలో కోటి దీపాలకాంతి వెలిగి దేవా లయంలో అఖండ దీపారాధన జరిగి నట్లనిపించింది.

స్నేహితులిద్దరూ ఒకరినొకరు గాఢంగా కౌగిలించుకున్నారు.

"నే - నేను విన్నదంతా.... నిజం కాదుకదూ?...." అశగా అన్నాడు చంద్రం.

"నిజమే! వత్తి పలికాడు రామం. అతని కంఠమెప్పుడూ "సత్యమేజయం" అంటూ కంచుగంట కొట్టినట్లు సప్త స్వరాలూ కమ్మగా వినిపించేది. కానీ.... ఆనాడు ఆ కంఠంలో అన్నీ అపస్వరాలే వినవచ్చాయి!

"రా....రామం...." ఏమిటో ప్రతి మాలుకుంటున్నట్లు అనబోయాడు చంద్రం.

"మన సంఘం ఒక నల్లబజారు. అందులో పెద్దమనుష్యుల్లా చలామణి అవుతున్న వారంతా త్రాచుపాములు. వీళ్ళను ఏంచేసినా పాపంలేదురాచంద్రం. ఈ చేతులతో వాళ్ళ రక్తం కుమ్మరించి భూదేవి దాహం తీర్చాలి"—క్రూరంగా ఘర్జించాడు— వికృతంగా నవ్వాడు.

కాలేజీలో చదువుకునే రోజులలో రామం ఎంత శాంతమూర్తి. ఎవరి రక్త మైనా నేలచిందితే కళ్ళనీళ్లు కార్చేవాడు. ఎవరైనా పోట్లాడుకుంటూవుంటేమధ్యకు ఉరికి అడ్డుపడి అందరినీ శాంతపరిచే వాడు. అటువంటి రామం కిరాతకుడిలా మారిపోయాడు. మృగంలా ఘర్జిస్తూ అరిచాడు.

విద్యార్థిదశ తియ్యగా తేనెబొట్టు చప్పరిస్తున్నట్లుగా సాగిపోయింది.రామం చెల్లెలు సరళను ప్రేమిస్తూ చంద్రం ఎన్నో కలలు కన్నాడు. సబ్ ఇన్స్పెక్టర్ రాజారావు కుమార్తె కమల రామానికి తన హృదయం అర్పించుకుంది. రామం మంచితనం, శాంత స్వరూపం చూచి రాజారావే ఒకనాడు రామాన్ని స్వయంగా యింటికి తీసుకువెళ్ళి సత్కారం చేశాడు. కళ్ళల్లో ఎన్నో ఆశాజ్యోతులు నింపు కుని ఆశయాలతో ఆవేశాలతో బ్రతికిన రోజులు వెళ్ళిపోయాయి. డిగ్రీ చదు

వులు పూర్తిచేశారు. విద్యార్థి దశ అయిపోగానే మత్తువదలి వాస్తవికతలోకి వచ్చిపడినట్లైంది. పెరుగుతున్న పరిసరాలు అందులో పేరుకుపోయిన అలవాట్లు, నమ్మకాలు, మంచీ—చెడూ, తల్లితండ్రులు — తోబుట్టువులు వారిమీద నిలుపుకున్న ఆశలు, ఇవన్నీదాటుకుని బయటపడతాము. నమ్ముకున్న ఆదర్శాలతో బ్రతుకు సాగించడం ఎంత కష్టమో తెలిసివచ్చింది ఉదర పోషణార్థం నాలుగురాళ్లు సంపాదించాలని డిగ్రీ చేతబట్టుకుని ఉద్యోగాన్వేషణలో పాదాలు అరిగిపోయేలా తిరగటంకన్న ఇంకేమీ సాధించలేకపోయారు.

ఎక్కడ చూచినా అన్యాయం — అక్రమం! వీటిని చుట్టుకుని లంచగొండితనం. ఈ విషవలయంలో చిక్కుకుని జీవితం సక్రమంగా సాగిపోతున్నదనుకొంటూ బ్రతుకు సాగించుకుని పోతున్న వారిని చూస్తూవుంటే రామంలోసహనం.. శాంతం పూర్తిగా చితికిపోయింది. వాటి స్థానంలో ద్వేషం—దౌర్జన్యం మొలకలు వేసుకున్నాయి. దివ్యంగా వెలుగుతున్న ఆశాజ్యోతి క్రమక్రమంగా సన్నగిల్లి.... చివరకు పూర్తిగా ఆరిపోయింది.

నిజాయితీపరునికి ఈ సంఘంలో స్థానంలేదని గ్రహించాడు రామం! అన్యాయస్థులను, నల్లబజారు వర్తకం సాగిస్తున్న పెద్దమనుష్యులను, దౌర్జన్యంతో అణచివేయాలనే దృఢనిశ్చయానికి వచ్చి చట్టాన్ని ధిక్కరించి తిరగబడ్డాడు.


అలనాడు ఇంటికితీసుకువెళ్ళి సత్కారం చేసిన పోలీసు ఇన్‌స్పెక్టర్ రాజారావు, రామానికి విరోధి అయినాడు. తండ్రిమీద కోపంతో కమలనుకూడా అవమానంచేశాడు. కమల మనస్సు విరిగిపోయి ఆత్మహత్య చేసుకుంది.

కమల మృతకళేబరం చితిలో కాలిపోతుంటే రామం హృదయంలో అగ్నిగుండమే చెలరేగి నలుదిక్కులూవ్యాపించింది. సాటి సహచరులతో వెళ్ళి ఇళ్లు కాల్చివేయటం, బాంబులు పేల్చడం, తలలు నరకడం, స్త్రీలను అవమానించడం—లేక్కలేనన్ని దౌర్జన్యాలు చేయడం మొదలుపెట్టాడు.

"రామం! రామం! ఎందుకురా.... అబ్బ! ఎందుకురా ఇంత వికృతంగా మారిపోయావు" అంటూ బాధగా విలపించాడు రామం.

"నువ్వో! నన్ను పోలీసులకు అప్పగించేయిరా! నీ కష్టాలన్నీ గట్టు ఎక్కుతాయి. హాయిగా ఒక ఇల్లు కట్టించేయి —" రామం బిగ్గరగా నవ్వాడు. రామం నవ్వు చంద్రం గుండెల్ని పీల్చి పిప్పి-పిప్పి చేసినట్లు అయింది.

అదంతా మొన్న మొన్న జరిగినట్లు, రామం నవ్వినవ్వు అక్కడ మరోసారి ప్రతిధ్వనించింది. చంద్రం చెవులు గట్టిగా మూసుకున్నాడు. పడమట




ఆకాశం కసితీరా ఎఱ్ఱగా మండిపోతున్నది.

తీరని కోరికలన్నీ తీరుతాయని వెఱ్ఱిగా కలవరించిన రోజులలో ఒకసారి ఇలాంటి సాయంసమయమే రామం, సరళా, తనూ షికారుగా ఈ ప్రాంతాలకు వచ్చారు.

ఆ రోజులలో సరళ బిఱ్ఱుగా జడలు వేసుకొని చురుగ్గా, అల్లరిగా కళ్లుపెట్టుకుని చూచేది. ఆమె కళ్ళలో చెంగు చెంగుమని రేగుతున్న చిలిపితనం అతని హృదయంలో వెన్నెల చిలికింది. మనసులో దాచుకున్న అనురాగం సరళకు వ్యక్తం చేసుకున్నాడు.

"సరళా....నేను మీ అన్నయ్యంతటి గొప్పవాణ్ణికాను....కానీ....నిన్ను ప్రేమిస్తున్నాను....నన్ను వివాహం చేసుకుంటావా?" అని తడబడుతూ అడిగాడు. సరళ బుగ్గలు కెంపులు తిరిగాయి.

పడమట సంధ్యారాగం, సరివిచెట్లు గాలికి ఊగుతూ చేస్తున్న శబ్దాలు ఇదంతా చూస్తూ ఉంటే చంద్రానికి హుషారు పుట్టుకువచ్చింది.

"అటు చూడు సరళా! పడమట ఆకాశం....నీ చెక్కిళ్ళలో సిగ్గు దొంతరలు చూస్తూవుంటే....ఆకాశమే...పెళ్ళికూతురై పోయిందేమోననే భావన కలుగుతున్నది. విను....విను....సరివిచెట్లు చిరుగాలికి పాడుతున్నాయి! మనకోసరం ప్రేమగీతాలు కావుకదా?" అతని మాటలకు సరళ కిలకిలానవ్వుతూ రామంవద్దకు పారిపోయింది.

"అన్నయ్యోయ్! చంద్రానికికవిత్వం వచ్చు!" అని అల్లరి చేసింది సరళ.

"నిజం? ఏమన్నాదేమిటి?" అని అడిగాడు రామం.

"ఎఱ్ఱగావున్న ఆకాశంకేసి వేలుపెట్టి చూపిస్తూ "ఆ కా శ ం ఎలావుంది అన్నయ్యా?" అంటూ కళ్ళు పెద్దవిచేసి అడిగింది సరళ.

"చెప్పనా? మనదేశ స్వాతంత్ర్యం కొరకు ప్రాణాలు ధారపోసిన అమర వీరుల రక్తంతో తడిసిన నేలలాలేదూ?" అన్నాడు రామం.

"ఛో అన్నయ్యా! పెళ్ళికూతురి పాదాలకు పెట్టిన పారాణిలా వుందని నేననుకుంటూ వుంటేను!" అన్నది సరళ.

"రా....రామం నేనుసరళనువివాహం చేసుకుంటాను." సరళ మాటలు విని ధైర్యంగా అన్నాడు చంద్రం. అతడన్న మాటలకు ఆ శిథిలమైన గుడిలో వినటానికి చెవులు, చూడటానికి కళ్లు, మాటలాడటానికి నోరులేని దేవుని రాతి మొండెమొక్కటే సాక్షి!!

అదే ఆఖరుసారి సరళను చంద్రం చూడడం!

కానీ ఈనాడు....అతని చెవులలో రామం నవ్విన నవ్వు మళ్ళీ మళ్ళీ ప్రతిధ్వనిస్తూవుంటే పడమటి దిక్కున మండిపోతున్న ఆకాశంలా అతని శరీరంలో ఎఱ్ఱని మంటలే రగిలాయి. చుట్టూ ఊగుతూ శబ్దాలుచేస్తున్న సరివిచెట్ల ఘోష అతని అంతరాత్మ పెడుతున్న ఘోషలా వుంది.

సరళను పెండ్లి చేసుకుంటాననిమాట యిచ్చి తప్పుకున్నాడు. కాబోయే మామగారు రెండువేల లంచం కుమ్మరించి తనకు ఉద్యోగ ప్రయత్నంచేస్తూవుంటే తనను కాదని పూరుకున్నాడు. కట్నం కానుకలు పుచ్చుకొని శారదను వివాహం చేసుకున్నాడు.

వివాహం ఘనంగా జరిగిపోయింది. ఆ మొదటిరాత్రి అమాయకంగా పవిత్రంగా నిలబడివున్న శారదనుచూచి చలించిపోయి ఆప్యాయంగా ఆమెను తన చేతులలోకి తీసుకున్నాడు.

"ఏమండీ?" —

"ఏమిటి శారదా!"

"న....నన్ను వివాహం చేసుకోవడం మీ....మీ కిష్టం లేదని విన్నాను—" భయంగా అనుమానంగా అడిగింది శారద.

"ఛా! ఎవరన్నారు!" గుండెల్లో ఎవరో చేయిపెట్టి కెలుకుతుంటే పెదవులమీద చిఱునవ్వు తెచ్చిపెట్టుకొని అన్నాడు.

"మీరు....ఎవరినో ప్రేమించారని విన్నాను—?" జాలిగా అన్నది శారద.

"లేదు శారదా!" అని అబద్ధం ఆడాడు.

శారద అతని మాటలు నమ్మింది. అతనిని ప్రేమించింది. ఆరాధించింది. భార్యగా అతనికి చేయవలసిన సేవలు చేసింది. అతని బిడ్డకు తల్లి అయింది.

తనభర్త జీవితంపెట్టిన పరీక్షలన్నింటి లోనూ ఓడిపోయి, పరిస్థితులకు లొంగి పోయిన వ్యక్తనీ, అతని అవసరాలకు అదర్శాలను మంటకలిపి సంఘం చేతిలో కీలుబొమ్మగా మారిపోయిన వంచకుడనీ అసమర్థుడనీ శారద తెలుసుకోలేక పోయింది.

రామం చేసిన నేరాలకు న్యాయ వేత్తలు తీర్పుయిచ్చి శిక్ష విధించారు. కానీ చంద్రం చేసిన నేరాలకు శిక్షలేదు! రామం ఎక్కడో జైలులో కటకటాల తలుపుల వెనుక రెక్కలు విరిగిన పక్షిలా కొట్టుకుంటూవుంటే, చంద్రాన్ని ఏ జైలు కటకటాల తలుపులు నిర్బం ధించకపోయినా అతనుకూడా రెక్కలు విరిగిన పక్షిలానే కొట్టుకొంటున్నాడు.

కాల ప్రవాహంలో సంవత్సరాలు కలిసిపోయాయి. ఆఫీసులో నెలజీతం రాబట్టుకుంటూ, పై అధికారి తప్పుడు లెక్కలు చూపిస్తూవుంటే నోరు మూసు కుని ఇష్టంలేని సంతకాలుచేస్తూ, జరుగు తున్న అక్రమాలను ఒక కంటితో చూస్తూ మరో కంటితో సహకరిస్తూ కాలం వెళ్ళ బుచ్చాడు చంద్రం. ఆఫీసులో పనులు ముగించుకొని ఫైళ్లు సర్దుకుంటూవుండగా ట్రింగ్‌మని టెలిఫోను మ్రోగింది.

"హలో!" అంటూ పలకరించాడు.

"నేను సరళను చంద్రం...." సరళ గొంతు వినిపించగానే షాక్ తగిలినట్లు తుళ్ళిపడ్డాడు. గొంతుకలో ఏదో అడ్డం పడినట్లు చాలా సేపు మాట్లాడలేక పోయాడు.

"చంద్రం.... ??"

చంద్రానికి శారదతో వివాహం కుదిరి నాక సరళకు ముఖం చూపించలేక తప్పుకు తిరిగాడు. మనసులో జ్ఞాపకాలు, ప్రేమమాత్రం చెరిగిపోకుండా ముద్ర వేసుకుని మిగిలిపోయాయి

"స....సరళా....!"

"నిన్ను ఒకసారి చూడాలిచంద్రం!" సరళ అవలివైపునుంచి బ్రతిమాలు కొంటూవుంటే చంద్రానికి దుఃఖం పొంగి పొరలింది.

"ఇంటికి రానా?" అని అడిగాడు.

"ఉహుఁ!....రామం అన్నయ్యతో కలిసి షికారుకు వెళ్ళేవాళ్ళమే....ఊరి అవతల....పాడుపడిన గుడివద్ద అరు గంటలకంతా కలుసుకుంటాను" అని గబగబా చెప్పి ఫోను పెట్టేసింది.

సరళను వెంటనే వెళ్ళి చూచిరావా లనే ఆత్రుత—ఆరాటం మనస్సులో అదికమౌతుంటే ఆఫీసులోంచి వడివడిగా బయటపడ్డాడు.

బండరాతిమీద కూర్చుని అలోచి స్తున్న చంద్రం పరిసరాలనే మరచి పోయాడు — ఏమిటేమిటో జ్ఞాపకానికి వచ్చాయి.

"ఏమిటి చంద్రం అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అంటూ సరళ వచ్చి పలకరించేంతవరకూ ఈ లోకంలో వచ్చి పడలేదు చంద్రం.

సంధ్యవెలుగులో ఆకాశం చిత్ర మైన రంగులు పులుముకుంటూ వుంది. కట్టుకున్న తెల్లచీరలో శాంతి దేవతలా చంద్రం కంటికి కనిపించింది సరళ. ఆమె కళ్ళలో ఎప్పుడూ తాండవమాడే చిలిపితనం కనిపించలేదు. ఆ కళ్ళలో బాధ - నిరాశ - జాలి - ఎన్నో భావాలు మిళితమైనట్లున్నాయి. ఆమె కనుపాపల్లో ఆకాశంలోని రంగులు, ఆమె మనో భావాలకు అనుగుణంగా మారుతూ ప్రతి ఫలిస్తున్నాయి.

"ఏమిటలా చూస్తున్నావు?" పేల వంగా నవ్వుతూ అడిగింది సరళ.

ఉలిక్కిపడ్డాడు చంద్రం.

"చిక్కిపోయావు సరళా!" అన్నాడు చంద్రం ఇంకేమనాలో తోచక!

చుట్టూవున్న ప్రదేశాన్ని సరళ పరీ క్షించి చూస్తూ "అబ్బ! ఈ సరివిచెట్లు ఎంత ఎత్తుగా ఎదిగిపోయాయో చూచావా? మనం అందుకోలేని ఆశలకు నిదర్శ నంగా వున్నాయి! శిథిలమైన ఈ గుడిలా మన ఆశలన్నీ నేలమట్టం అయ్యాయి! ప్చ్! గడచిన జ్ఞాపకాలు మాత్రం ఇంకా తీయ - తీయగా ఉన్నా యనిపిస్తుంది! గతంలోకి కాస్సేపు వెళ్ళి పోవాలని వుంది చంద్రం!" అని అన్నది సరళ.

"అంత అదృష్టం మనకున్నదంటావా సరళా?" చంద్రం దీనంగా అన్నాడు.

"అన్నట్లు లోన గర్భగృహంలో దేవుని మొండి విగ్రహం ఇంకా ఉందా?" అని అడిగింది సరళ.

"ఆఁ! ఉన్నచోటనే ఉన్నది. మన మంతా ఆ దేవునిభక్తుఁమని రామం అభిప్రాయం" అన్నాడు చంద్రం.

"అలాగా? ఐతే లోనికి పద.... 'మన' దేవుని దర్శనం చేసుకునివద్దాం!" అంటూ పాడుబడిన గుడిలోకి దారితీసింది సరళ. కూలిన గోడల మధ్యనుండి సంధ్యవెలుగు ఇంకా లోనికి వస్తున్నది. గర్భగృహంలో ఎప్పటిలా సాలీడుగూడు చేసుకునివుంది. అక్కడకూడా గబ్బి లాయిలు వ్రేలాడుతున్నాయి. భయం కరంగా వుంది అక్కడి ప్రదేశం!

"చంద్రం—" అంటూ పిలిచి ఆగి పోయింది సరళ.

"ఏమిటి సరళా?" అన్నాడుచంద్రం. అపరాధినిలా చంద్రం మొహంలోకిచూచి "శారద చాలా మంచిదని విన్నాను" గబ గబా అన్నది సరళ. జవాబు చెప్పకుండా మౌనంగా మిగిలిపోయాడు చంద్రం.

"చంద్రం .... నిన్న .... ఇక్కడకు ఎందుకు రమ్మనమని అడిగానో తెలుసా?" అతని కళ్ళలోకి దీర్ఘంగాచూస్తూ అన్నది సరళ. ఆమె కళ్ళలోకి పరీక్షగా చూస్తూ చేతులు కట్టుకుని మిగిలిపోయాడు చంద్రం.

"చంద్రం....నాన్న పోయాక మేము చాలా చిక్కుల్లో పడిపోయాము. అన్నయ్య సంగతి నీకు తెలుసు....

అన్నయ్యను విడిపించుకోవాలని పాపం అమ్మ వీళ్ళకు, వాళ్ళకు వెట్టిగాలంచాలు కుమ్మరించింది. అన్నయ్య విడుదల కాకపోవడమే కాకుండా అప్పుల్లో పడ్డాము. అమ్మ దిగులుతో మంచాన పడింది. ఇప్పుడు ఇంటి భారమంతా నేనే మోస్తున్నాను. రోజుకు రోజుకు ఖర్చులు పెరిగిపోతున్నాయి. అప్పులవాళ్లు రోజూ వచ్చి గల్లంతు చేస్తున్నారు. శేఖర్ చదువు మానేసి కూలిచేసి బ్రతుకుతాను అంటున్నాడు. వాడుగూడ అన్నయ్యలా మారిపోతాడేమోనని భయంగా వుంది. రాధకి ఒంట్లో బాగుండటంలేదు. దగ్గూ, జ్వరం—ఎక్స్‌రే తీయించి కొన్ని పరీక్షలు చేయాలని డాక్టరన్నాడు—" సరళ చెప్పుకుపోతుంటే చంద్రం కడుపులో ఎవరో చేయిపెట్టి కెలికినట్లై తల వెంట్రుకలు పీక్కోవడం మొదలుపెట్టాడు.

"ని....నిన్ను డబ్బు సహాయంఅడగడానికి ఇక్కడకు రప్పించలేదుచంద్రం. నీ పరిస్థితి నాకు తెలియకపోదు. నాకు ఎటువంటి సహాయం చేయలేని పరిస్థితిలో వున్నావని బాధపడకు" అతని భుజం మీద చేయివేసి నొక్కి అన్నది సరళ.

"ఎక్కడైనా....ఎక్కడైనా దొంగతనం చేయగలిగితే బాగుండును"అన్నాడు చంద్రం బాధగా పళ్ళు కొరికి దుఃఖం దిగమింగుతూ.

"శేఖర్ అంతపనీ చేస్తాడేమోనని ....నేనొక నిర్ణయానికివచ్చానుచంద్రం" ఆవేశంగా అన్నది సరళ.

అనుమానంగా సరళ ముఖంలోకి చూచాడు చంద్రం.

"నేను మోహన్‌రావు బట్టలకొట్టులో సేల్సుగరల్‌గా పనిచేస్తున్నానని నీకు తెలిసే వుంటుంది. అ....అది పైకి బట్టలకొట్టు అన్న పేరేకానీ లోనజరుగుతున్న విషయాలు మీలాంటివారికి తెలియవు. అ....అది ఒక బ్రాథెల్ హౌస్!!" అన్నది సరళ.

"సరళా!!" గట్టిగా అరిచాడుచంద్రం.

"గత్యంతరంలేక అక్కడ పనిచేస్తున్నాను. ప్రతిరోజూనన్ను మోహన్‌రావు అడుగుతూనే వున్నాడు. వాడి మీద ఉమ్మేసి బయటకు నడవలేక అతనిచ్చే జీతపు రాళ్ళకోసంనోరు మెదపకుండా 'నన్ను క్షమించండి సార్!' అంటూ గడుపుకొస్తున్నాను! కానీ....కానీ...." అంటూ సరళ గొంతు జీరబోయింది.

"నువ్వు ఏం చెప్పదలుచుకున్నావు సరళా?" భయంగా అడిగాడు చంద్రం.

"నేను....ఇవాళ రాత్రి....పది గంటలకు....మోహన్‌రావు వెంట వెళ—" సరళ చెంప ఛెళ్ళుమన్నది! కొంతసేపు నిర్ఘాంతపోయింది సరళ.

పిడికిళ్ళు బిగించి పిచ్చివాడిలా అటూ ఇటూ పచార్లు చేయడం మొదలుపెట్టాడు చంద్రం.

సరళ పిచ్చిదానిలా నవ్వడం మొదలుపెట్టింది.

"సరళా! ఆపు నీ నవ్వు." కోపంగా బిగ్గరగా ఘర్జించాడు చంద్రం.

"ఏం ? నీ ఆదర్శాలను బలిచేసుకొని లంచంయిచ్చి ఉద్యోగం సంపాదించి నప్పుడూ, నీ వాళ్ళను ఉద్ధరించటానికి గాను కట్నం పుచ్చుకొని అమ్ముడుపోయి నప్పుడూ నేను నిన్ను చెంపదెబ్బ కొట్ట లేకపోయినందుకా ? అన్నయ్య అంతటి వాడే కమలను అవమానించినప్పుడూ, గూండాలతో చేరి ఇళ్లూ వాకిళ్లూ తగల పెట్టినప్పుడూ నేను అన్నయ్యను చెంప దెబ్బ కొట్టనందుకూ ఇప్పుడు ఈ నవ్వు ఆపి ఏడ్వమన్నావా చంద్రం ? ఐతే చంద్రం ఈనాడు నీచేత ఈ చెంప దెబ్బ తినటానికి కారకులు ఎవరు ? నువ్వా ? అన్నయ్యా ? లేక ఈసంఘమా? చెప్పు చంద్రం ? చెప్పు ?" ఆవేశంతో ఊగిపోతూ పౌరుషంగా మాట్లాడింది సరళ.

చంద్రం సిగ్గుపడ్డాడు. ఉప్పెనలా అతనికి దుఃఖం పొంగి పొరలింది. బావురుమన్నాడు. సరళ వెన్నముద్దలా కరిగిపోయింది.

"చ....చంద్రం...." అంటూ అతనిని రెండు చేతులతో చుట్టివేసి ఓదార్చ బోయింది.

ఆమె కౌగిలిలో అతనికి ఉపశమనం దొరికింది. కానీ ఏదో తప్పుచేసినవాడిలా ఆమెకు దూరంగా జరగబోయాడు.

"ఏ....ఏమిటి చంద్రం ? ఈ సరళ ఇంకా మలినం కాలేదులే—" అంటూ ఏదో అనబోయింది.

'సరళా....దయచేసి అలా మాట్లాడకు....నన్ను....'మాట్లాడలేకపోయాడు చంద్రం.

"చంద్రం....జీవితంలో నేను కన్న కలలన్నీ ఏనాడో తుడుచుకుపోయాయి. నిన్ను మనసారా ప్రేమించాను. నీభార్యను కావాలని కలలు కన్నాను ...అన్నీ తీర కుండానే నా జీవితం వెళ్ళిపోతున్నది. ఈ రాత్రి పదిగంటలకు ఎవడో పరాయి మగవాడు, నాకు ఏమీ కానివాడు.... కేవలం డబ్బు నా మొఖాన పారేసినన్ను అనుభవించనున్నాడు—" సరళమాటలు వినిపించుకోలేకపోయాడు చంద్రం !

"సరళా !" అంటూ పిచ్చివాడిలా అరిచాడు చంద్రం.

"అ....అవును చంద్రం ! నన్ను.... నే....నేను ఈ ఉరికంబం ఎక్కే-లోపల నన్ను ఒక్క-సారి మనసారా ప్రేమించు చంద్రం ! ఈ క్షణం - ఈ క్షణం నా జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను." సరళ ఏడుస్తూ అన్నది.

"న....నన్ను పరీక్షిస్తున్నావాసరళా?" ఒణికిపోతూ అడిగాడు చంద్రం.

"పరీక్షా ? లేదు చంద్రం లేదు ! స్వార్థంతో నా కోరిక తీర్చమని అడుగుతున్నాను. ఈ క్షణం జారవిడుచుకోవాలనిలేదు....నన్ను నీగుండెలకుహృదయ పూర్వకంగా హత్తుకో చంద్రం...." అంటూ సరళ పలికింది. విలపించింది, వలపించింది.

చలించిపోయాడు చంద్రం!

సరళను గాఢంగా కౌగిలించుకున్నాడు. ప్రపంచాన్నే మరిచిపోయాడు. ఆమె పెదవులు అందుకున్నాడు. ఆమె మీద అనురాగం కుమ్మరించాడు. సంధ్య వెలుగులుపోయి చుట్టూ చీకటి ఆవరించిరాత్రి వచ్చినట్లు వుంది. బయట చల్లటి గాలి వీచుతూవుంది. సరివి చెట్లు గాలికి ఊగుతూ మంత్రాలు చదివాయి. శిరస్సు లేని దేవుడు ఆ ప్రేమికులను దీవించి పవిత్రత చేకూర్చక తప్పలేదు.

ఆకాశంలో చందమామ చుక్కల మధ్య తిరుగుతూ వెన్నెల చిలుకుతున్నాడు. చందమామ ముఖంలో నల్లని మచ్చలు స్పష్టంగా కనుపిస్తున్నాయి. కానీ వెన్నెలమాత్రం ప్రకాశవంతంగానే వుంది.

ఎక్కడో ఇరుకు సందులో కూలిన మేడ పైభాగంలో డాబామీద చంద్రం కోసరం ఎదురుచూస్తూపసిబిడ్డకు అన్నం కలిపి పెడుతున్న శారద చందమామను చూపిస్తూ "చందమామ రావే....జాబిల్లి రావే...." అని సన్నగా పాట పాడుతున్నది. ఈ దృశ్యాన్ని చూస్తూ ఆమె అత్తమామలు తృప్తిగా నిట్టూర్చారు.

ఇంకెక్కడో పెంకుల వసారాలో పడుకుని మూలుగుతున్న రాధి వెన్నెల కాంతికి ఉలిక్కిపడి "చంద్రోదయం కూడా అయింది బుల్లిన్నయ్యా! అక్కయ్య ఇంకా రాలేదా?" అనిహీన స్వరంతో అడిగింది.

అంతవరకూ మెదలకుండా పక్క మీద పరధ్యానంగా కూర్చున్న ముసలిది "అవును శేఖర్! సరళ ఇంకా రాలేదెందుకని?" అని అడిగింది.

"ఆఫీసులో ఏవో పనులువున్నాయని మోహనరావుగారు సరళను రమ్మన్నారట. ఆలస్యంగా వస్తానన్నది" అంటూ పుస్తకంలోంచి తల పైకెత్తి జవాబు చెప్పాడు శేఖర్.

